క్లుప్తంగా

సత్తా చాటిన బాడ్మింటన్ క్రీడాకారులు

రాయదుర్గం: ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌లో బాడ్మింటన్ క్రీడాకారులు సత్తా చాటారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ సెంటర్ మాజీ హెడ్ డాక్టర్ కేఎస్ కమలాకర్ కె రాఘవేంద్రరావుతో కలిసి డబుల్స్ బాడ్మింటన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. సికింద్రాబాద్ రైల్వే రిక్రియేషన్ క్లబ్ అయిదో నేషనల్ మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్–2023 పోటీలను నిర్వహించగా అందులో డబుల్స్ పోటీలో విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన డా. కమలాకర్, కె.రాఘవేంద్ర రావును శనివారం పలువురు క్రీడాకారులు ఘనంగా సత్కరించారు.

ఆర్ట్‌గ్యాలరీలో కచేరీ

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన సంగీత కచేరీ సందర్శకులను అలరించింది. శనివారం టూరింగ్ ది ల్యాండ్ మ్యూజికల్ పేరిట ఏర్పాటు చేసిన కచేరికి రాష్ట్ర ఐటీ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, అలియన్స్ ఫ్రాంచైజీ డైరెక్టర్ శామ్యూల్ బెర్తట్‌లు పాల్గొన్నారు. కళాకారులు సుకంత బోస్, అలెగ్జాండర్ జుర్గెన్, దాసరి కొండప్పలు వాయిద్య సహకారమందించారు.

ఉచిత శిక్షణ

మాదాపూర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జనరల్ కేటగిరి బీఈ లేదా బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 33 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాంను, ఎస్సీ, బీసీ–సీ వర్గానికి బీఈ, లేదా బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 3 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాం ఉచిత శిక్షణ, భోజన వసతి, 100శాతం ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం వి.భార్గవచారి ఫోన్ 7097114947లో సంప్రదించగలరు.

నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం రాధా నిలయం శిష్యులు నృత్యార్చన చేశారు. గురువు ఇమ్మడి రాధామోహన్ ఆధ్వర్యంలో తనిష్క, రిత్విక, శాన్వి, హవ్య సహస్ర, శరణ్య, హితాశ్రీ, చతురశ్రీ, ఆరోధ్య, ఆముక్త, అనన్య, అద్విక, కమలిని, కీర్తన, సాత్వికలు ప్రదర్శించారు.

నిత్యం నడక, వ్యాయామం అవసరం

కేన్సర్ అవగాహన కార్యక్రమాల్లో వైద్యులు

వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని శనివారం పలు ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నిత్యం నడక ,వ్యాయామం అవసరమని.. అలాగే పొగాకు వినియోగం, మద్యం, ఆహారం తదితరాలపై జాగ్రత్త వహించాలని సూచించారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ జనప్రియ అపార్ట్‌మెంట్స్ కమ్యూనిటీ హాల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేన్సర్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ అజయ్ చాణక్య వల్లభనేని, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్ బారిన పడి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బోయిని అనూష మహేష్ యాదవ్, విష్ణు ప్రసాద్, రామారావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్, జయప్రకాష్ నారాయణ, అనురాధ పాల్గొన్నారు.



రామకృష్ణనగర్‌లో అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే గాంధీ

కిమ్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఎమ్మెల్యే గాంధీలు హాజరై నడక ర్యాలీని ప్రారంభించారు

కాంటినెంటల్ ఆస్పత్రిలో ‘క్లోజ్ ది కేర్ గ్యాప్’


రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ‘క్లోజ్ ది కేర్ గ్యాప్’ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ కేన్సర్ ఎడ్యుకేషన్‌పై ప్రచారం పెద్ద ఎత్తున చేయాల్సిన అవసరం ఉందన్నారు


మెడికవర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

పటాన్‌చెరు: ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండల పరిధిలోని పోచారం, ముత్తంగి, చిట్కుల్, రామేశ్వరంబండ, బచ్చుగూడెం, ఇంద్రేశం, ఐనోలు, చిన్నకంజర్ల, పెద్ద కంజర్ల గ్రామాలలో రూ.95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపటనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీలు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ముత్తంగి గ్రామ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో నూతన రామాలయం నిర్మాణ పనుల భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దేవాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా, జెడ్పీటీసీ సుప్రజ, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, ఎంపీడీవో బన్సీలాల్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి షర్మిల తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అలరిపు, జతిస్వరం, వర్ణం తదితర అంశాలను ప్రదర్శించింది. అదే విధంగా శ్రీ సాయికృప కూచిపూడి కళాక్షేత్రం బిందుమాధవి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

ఓవరాల్ టాపర్ స్వింగ్ కింగ్స్

సాక్షి, సిటీబ్యూరో: హోరాహోరీగా సాగుతున్న హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్‌లో గ్రూప్ స్టేజ్ ముగిసింది. 16 జట్లలో 8 జట్లు నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించాయి. ఐదో రౌండ్ కూడా నువ్వా నేనా అన్నట్టు సాగింది. అయితే ఎంవైకే స్ట్రైకర్స్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. లీగ్ స్టేజ్ చివరి రోజు 185 పాయింట్లు సాధించి ఓవరాల్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. లీగ్ స్టేజ్ ముగిసేసరికి ఓవరాల్ టాపర్‌గా 769 పాయింట్లతో స్వింగ్ కింగ్స్ నిలిస్తే... ఎంవైకే స్ట్రైకర్స్ 763 పాయింట్లతో తర్వాతి స్థానంలో నిలిచింది. గ్రూప్ ఏ నుంచి సామా ఏంజెల్స్, మీనాక్షి మావెరిక్స్, గ్రూప్ బి నుంచి స్వింగ్ కింగ్స్, లాహిరి లయన్స్, గ్రూప్ సి నుంచి ఎంవైకే స్ట్రైకర్స్, టీమ్ ఆల్ఫా, గ్రూప్ డి నుంచి టీమ్ మైసా, టీమ్ స్వాన్స్ నాకౌట్‌కు క్వాలిఫై అయ్యాయి. లీగ్‌లో తర్వాతి రౌండ్ పోటీలు ఫిబ్రవరి 8న హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వేదికగా జరగనున్నాయి.

మే 3న ఫర్నిచర్ ఫెయిర్

సాక్షి,సిటీబ్యూరో : నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మే 3న ఫర్నిచర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ అభిరుచికి అనుగుణంగా ఫర్నిచర్ సేకరణకు ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఈ ఎక్స్‌పోలో సోఫా సెట్లు, డైనింగ్ టేబుల్స్, బెడ్ రూమ్ యూనిట్లు, ఆఫీస్ ఫర్నిచర్, మాడ్యులర్ కిచెన్ యూనిట్లు, తివాచీలు, రగ్గులు, పరుపులు, పెయింటింగ్‌లు, వాటర్ ఫౌంటేన్‌లు, పిల్లల ఫర్నిచర్, కళాఖండాలు ఉంటాయన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సన్మానం



రాయదుర్గం: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను నానక్‌రాంగూడలో బీజేపీ నాయకులు శనివారం సత్కరించారు. నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను గచ్చిబౌలి డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు శివాసింగ్ నివాసంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచర్ల ఎల్లేష్, వరలక్ష్మీ, కిషన్, అనిల్‌కుమార్‌యాదవ్, రంజిత్‌సింగ్, ప్రభాకర్, శేఖర్, వెంకటేష్, బబ్లూసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్, చందానగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, ఓపెన్‌జిమ్, వరదనీటి కాల్వ పనులకు కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘త్రివేణి సైన్స్ ఉత్సవ్’

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని త్రివేణి స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ‘త్రివేణి సైన్స్ ఉత్సవ్’ పేరిట నిర్వహించిన ప్రదర్శనను హెచ్‌ఎం ఎల్.శంకర్, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ప్రదర్శనలో ఉంచిన నమూనాల గురించి విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్‌ఓ సాయినర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న హెచ్‌ఎం శంకర్, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి

ముగిసిన రంగనాథుని బ్రహ్మోత్సవాలు

● వైభవంగా చక్రతీర్థం



రాయదుర్గం: రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. బాలభోగం , అర్చన, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిపారు. ఆలయ ప్రాంగణంలోని బావిలో వైభవంగా చక్రతీర్థం నిర్వహించారు. అనంతరం ఆలయంలో వసంతోత్సవం, ద్వాదశ, ఆరాధన, దేవతా విసర్జనం, ధ్వజారోహణం, భేరి పూజ, మూకబలి, సప్తవర్ణ పూజా కార్యక్రమాలను చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ నాయకులు

నానక్‌రాంగూడలోని రంగనాథస్వామిని శనివారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్‌లు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

‘రాల్– ఇ–హైదరాబాద్.. ట్రాఫిక్ మళ్లింపు

రాయదుర్గం: ‘రాల్–ఇ–హైదరాబాద్’ నిర్వహణ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కార్యక్రమం కొనసాగుతుంది.సుమారు 1000 నుంచి 1200 మంది వాహనాల యజమానులు తమ వాహనాలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపును అమలు చేస్తున్నామని, ఇందుకు అందరూ సహకరించాలని వారు కోరారు.

రూట్ : 1 పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్ నుంచి హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వరకు..

రూట్: 2 మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వరకు..

మాదాపూర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ..

1.సైబర్ టవర్ జంక్షన్ నుంచి అపర్ణ/మీనాక్షి టవర్స్, కొండాపూర్, మియాపూర్ వైపు వచ్చే ట్రాఫిక్ ఖాజామెట్ జంక్షన్ మీదుగా హైటెక్స్ జంక్షన్–సీఐఐ జంక్షన్–కొత్తగూడ జంక్షన్–కుడి మలుపు మీదుగా కొండాపూర్, మియాపూర్ వైపు మళ్లించబడుతుంది.

2.కొత్తగూడ నుంచి జూబ్లీహిల్స్ వైపు వచ్చే ట్రాఫిక్ సీఐఐ జంక్షన్–కుడి మలుపు–టెక్ మహీంద్రా–డెల్–హెచ్‌బీసీ–లెమన్ ట్రీ జంక్షన్–ఎడమ మలుపు–యూ మలుపు మాదాపూర్, జూబ్లీహిల్స్ వైపు మళ్లించబడుతుంది

3. హైటెక్స్ జంక్షన్ నుంచి ఖానామెట్ జంక్షన్ వరకు, ఖానామెట్ జంక్షన్ నుంచి హైటెక్స్ వైపు వచ్చే వాహనాలు ఒకే రహదారి నుంచి కోన్‌లతో విభజించి పంపబడుతుంది.

రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో..

1. టీహబ్ వైపు మైహోమ్ అబ్రాలేస్ ఐకియా రోటరీకి.. వెళ్లాలి.

2. అలాగే ఐఓసీఎల్ రోడ్, మై హోమ్ భూజ లేన్–1, మైహోమ్ భూజా లేన్–2 టిహబ్ వైపు తిరిగి అదే రహదారి నుంచి ఎన్‌సీబీ జంక్షన్‌కు ట్రాఫిక్ మళ్లించబడుతుంది.

ప్రత్యామ్నాయ మార్గాలు..

1. ఐకియా మధ్య బయో డైవర్సిటీ జంక్షన్ వైపు అన్ని లేన్‌లు మూసివేయబడతాయి. ట్రాఫిక్ బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద ఖాజాగూడ జంక్షన్ మీదుగా విష్పర్ వ్యాలీ వైపు మళ్లిస్తారు.

2.టీ హబ్ వైపు మైహోమ్ అబ్రాలేస్ మూసివేయబడుతుంది. మైహోమ్ అబ్రా సిగ్నల్ వద్ద ఐకియా రోటరీ వైపు ట్రాఫిక్ మళ్లిస్తారు.

భారీ వాహనాల రాకపోకలపై నిషేధం

మాదాపూర్, రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలు ట్రక్కులు, లారీలు, డీసీఎంలు, ఆర్ఎంసీ, వాటర్ ట్యాంకర్లు అనుమతించబడవు, ముఖ్యంగా కావూరిహిల్స్ జంక్షన్ నుంచి సైబర్‌టవర్స్ జంక్షన్ మీదుగా కొత్తగూడ జంక్షన్ వరకు, సైబర్ టవర్ జంక్షన్ నుంచి బయోడైవర్సిటీ జంక్షన్ వరకు, ఏఐజీ ఆస్పత్రికి సీఓడీ జంక్షన్ వరకు, ఖానామెట్ నుంచి హైటెక్స్ జంక్షన్ ప్రాంతాలలో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. ఈ మార్పులను వాహనదారులు గమనించాలని సూచించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

మియాపూర్ : మియాపూర్ మాతృ శ్రీనగర్ కాలనీలోని కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని మాతృ శ్రీనగర్ అసోసియేషన్ సభ్యులు మియాపూర్ పోలీసులను కోరారు. ఈ మేరకు ఎస్ఐ యాదగిరిరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో కాలేజీలు, పాఠశాలలు ఉండడంతో నిత్యం రద్దీ ఉంటుందని ఈ కాలనీలో నాలుగు రోడ్ల కూడళ్లు ఉన్నాయని తెలిపారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని,ఇటీవల విద్యార్థులు దుర్మరణం చెందారని వారు తెలిపారు.

